పెదమేరంగిలో ఏనుగుల బీభత్సం

రైస్ మిల్లులో చొరబడి తలుపులు, కిటికీలు ధ్వంసం
30 ధాన్యం బస్తాలు చిందరవందర

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలో గల పెదమేరంగి కూడలి సమీపాన గల శ్రీ సాయి గాయత్రి మినీ మోడరన్ రైస్ మిల్లులో గురువారం అర్ధరాత్రి ఏనుగులు గుంపు బీభత్సం సృష్టించాయి. మిల్లులోకి ప్రవేశించి కిటికీలు, తలుపులు ధ్వంసం చేసి 30బస్తాల ధాన్యాన్ని చిందరవందర చేసి వెళ్లిపోయాయి. ఏనుగుల వల్ల ఇలా జరగడం ఇది ఐదవసారి కావడం గమనార్హం. ఇలా జరగడం వలన ప్రతీసారి కనీసం రూ.50,000 వరకు నష్టం సంభవిస్తూ వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు గాని, అటవీ అధికారులు గాని ఏనుగుల కదలికలపై పరిశీలనల చేయాల్సిన అటవీ శాఖ సిబ్బంది పగలు మాత్రమే గమనించి రాత్రి వేళల్లో అసలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు తన మిల్లు వద్ద జరిగిన నష్టాన్ని పరిశీలించి నష్టపరిహారాన్ని ఇప్పించాల్సిందిగా బాధితుడు కోరుతున్నాడు.

బాల్యంలో విద్యనభ్యసించిన ప్రాంతంలోనే పదవీ విరమణ అదృష్టం

జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరి

విశాలాంధ్ర - పార్వతీపురం: పోలీస్ శాఖలో ప్రత్యేక కాలం 36 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి, ఎన్నో సమస్యలను ఎదురొడ్డి, కష్ట నష్టాలు ఓర్చి ఆరోగ్యంగా, ఆనందంగా స్వచ్ఛంద పదవీ విరమణ చెందటం అదృష్టమని, బాల్యంలో విద్యను అభ్యసించిన ప్రాంతంలో ఒక్కరోజు ముందు అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టి పదవి విరమణ చేయడం చాలా ఆనందంగా ఉందని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎల్.నాగేశ్వరి తెలిపారు. గురువారం పదవి బాధ్యతలు చేపట్టి శుక్రవారం పదవి విరమణ చేసిన నాగేశ్వరిని పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్ శాఖ సన్మానించి వీడ్కోలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎస్బీ సిఐ రంగనాథం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, డిసిఆర్బి సిఐ రమేష్, ఆదామ్, ఏఆర్ ఆర్ఐ నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, పార్వతీపురం సిఐ మురళీధర్, పదవీ విరమణ పొందిన అదనపు ఎస్పీ కుటుంబ సభ్యులు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉంచుకోవాలి

- ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని పీహెచ్‌సీలలో రోగులకు అవసరమయ్యే మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన దోనుబాయి పీహెచ్‌సీని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం సీతంపేటలోని పట్టుపురుగుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టుపురుగుల నుండి దారం తీసే విధానాన్ని పరిశీలించారు. పట్టు పరిశ్రమ ద్వారా వచ్చే ఆదాయము, కార్మికులకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కారిగూడలోని పట్టుపరిశ్రమకు సంబంధించిన షెడ్డు పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న మల్బరీ తోట సాగును పరిశీలించారు.ఈ కార్యక్రమాల్లో సెరికల్చర్ ఏడీ సాల్మన్ రాజు, వైద్యాధికారి భాను ప్రతాప్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చుని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. శాంతిని కోరుతూ నిర్వహించిన హోమం, ఇతర పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి పూజ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య పెద్దలు, కన్యకా పరమేశ్వరి భక్తులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని చినభోగిల గ్రామానికి చెందిన చొల్లంగి గణపతి కుమారుడు ప్రణవ్ ఎనీమోనియా వ్యాధితో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే విజయ్ చంద్ర దృష్టికి తీసుకొని వెళ్లగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మూడు లక్షల చెక్కును మంజూరు చేశారు. దీన్ని ఎమ్మెల్యే విజయ్ చంద్ర పార్వతీపురం క్యాంపు కార్యాలయం వద్ద చొల్లంగి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు వేణుగోపాలనాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, అరవింద్ కుమార్, శంకర్రావు, రాము, చంటి, భాస్కరరావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి

విశాలాంధ్ర - బలిజిపేట: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలని ఏఐ ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఫీజుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేయటం వలన విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న విద్యాసంస్థలను సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు భీమరాజు పాల్గొన్నారు.

ఎంఈఓ-1 అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బెలగాం: ఎంఈఓ-1 అసోసియేషన్ క్యాలెండర్లను రాష్ట్ర కెజిబివి డైరెక్టర్ డి. దేవానందరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు విచ్చేసిన దేవానందరెడ్డిని ఎంఈఓ-1 అసోసియేషన్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఈఓ-1 అసోసియేషన్ రాష్ట్ర కమిటీ రూపొందించిన స్టిక్కర్, క్యాలెండర్లను దేవానందరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా దేవానంద రెడ్డి మాట్లాడుతూ కేజీబీవీలలో చదువుతున్న విద్యార్థుల స్థాయిని ఎప్పటికప్పుడు ఎంఈఓలు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి తేజేశ్వరరావు, జీసీడీఓ మధు, ఏఎంఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కులు - నైతిక విలువల పరీక్ష

విశాలాంధ్ర - పార్వతీపురం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు శనివారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు మానవ హక్కులు - నైతిక విలువలపై పరీక్ష నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ వృత్తి విద్యాశాఖ అధికారి డి.మంజులావీన తెలిపారు. పరీక్షకు గంటముందు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు లాగిన్ ద్వారా ఓటిపి వచ్చిన తర్వాత పరీక్షా పత్రం ఇంటర్మీడియట్ బోర్డ్ పంపించడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 80 ప్రభుత్వ, ప్రైవేట్, వివిధ యాజమాన్యాల పరిధిలో ఉంటున్న ఇంటర్ కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూల్యాంకనం పూర్తిచేసి ఆన్లైన్‌లో మార్కులు పోస్ట్ చేయాలని ఆదేశించారు.

గొల్లగానిగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ట్రైబల్ రైట్స్ ఫోరం డిమాండ్

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని మరుపల్లి పంచాయతీ గొల్లగాని గూడ గ్రామంలో తరతరాలుగా జీవిస్తున్న గిరిజనులు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకి గురవుతున్నారని తక్షణమే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరమ్ సభ్యులు డిమాండ్ చేశారు. మట్టిరోడ్డును ప్రతి ఏటా సొంత నిధులతో గోతులు కప్పుకుంటున్నారని ఎటువంటి అత్యవసర పరిస్థితి అయినా ఈ రహదారిని ఆశ్రయించాలంటే నరకంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు ఐ.రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గేదెల చిన్నమ్మతల్లి మాస్టారుకు పదవీ విరమణ సత్కారం

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న గేదెల చిన్నమ్మ తల్లి మాస్టర్ ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఉపాధ్యాయ వృత్తిని ఎంతో గౌరవంతో పనిచేసి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన మాస్టర్‌కు మక్కువ జడ్పిటిసి మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు ప్రసాద్ నాయుడు, ఎస్ఎంసి చైర్మన్ కోన ఈశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, హెచ్ఎం హేమలత, కుటుంబ సభ్యులు పాల్గొని చిన్నమ్మ తల్లి మాస్టర్ దంపతులకు సత్కారం చేసి పుష్పగుచ్ఛాలు బహుమతులు అందజేశారు.

ఐటీడీఏ ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విశాలాంధ్ర - సీతంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రతీ సోమవారం సీతంపేట ఐటిడీఏలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అప్పటివరకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించబడదని అన్నారు. కావున గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవడానికి సీతంపేట ఐటిడిఏకు ఎవ్వరూ రావద్దని పీవో కోరారు.

1/70 చట్టం జోలికొస్తే సహించం

సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ

విశాలాంధ్ర - పాడేరు: 1/70 చట్టం జోలికి ఎవరు వచ్చినా సహించబోమని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టం అనేకమంది ఆదివాసుల బలిదానాలతో వచ్చిందని, భారత రాజ్యాంగం ఆదివాసులకు కల్పించిన 1/70 చట్టం ఆదివాసులకు రక్షణ కవచం అని, అలాంటి చట్టాల జోలికి ఎవరైనా వస్తే, తమ ప్రాణాలు ఫణంగా పెట్టి కాపాడుకుంటామన్నారు. సాక్షాత్తు ఒక సభాపతి మాట్లాడటం ఆదివాసులకు అవమానించటమేన్నారు. సభాపతి మాటలు వెనక ప్రభుత్వ రహస్య అజెండా ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఆదివాసుల భూములు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని ఒప్పందాలు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకుందన్నారు. చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడిన మాటలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి చంటి, జల్లి రాజుబాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలి

విశాలాంధ్ర - పెదబయలు: చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని శుక్రవారం గిరిజన సమైక్య గిరిజన సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెదబయలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, గిరిజన సంఘం అధ్యక్షులు సాగని ధర్మాన పడాల్, జెడ్పీటీసీ కూడా బొంజుబాబు మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో 1/70 చట్టం సవరణ చేయాలని అయ్యన్నపాత్రుడు అధికా రులను ఆదేశించడం చాలా దుర్మార్గమని, 5వ షెడ్యూల్ ఆదివాసి ప్రాంతంలో 1/70 చట్టం ఉండటం వలన గిరిజన భూములకు రక్షణ ఉందని ఇది కాస్త మారిస్తే ఆదివాసీ ప్రాంతం సర్వనాశనం అయిపోతుందన్నారు. విజన్ 2047 పేరుతో మళ్లీ 1/70 చట్టం మార్పులు చేసి ఆదివాసీ ప్రాంతంలో అడవులు, భూములు, ఖనిజ సంపద బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజా సంఘాల నాయకులు జంపరంగి సునీల్ కుమార్, గుబరి, రాధాకృష్ణ కొమ్మ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గెమ్మెలి పంచాయతీ పొత్తడిగొంది గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు సిదేరి సత్తిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కావాలని అభివృద్ధి పేరుతో ఆదివాసి ప్రాంతాలను మైనింగ్ బాక్సైట్ వంటి ఖనిజ సంపద దోచుకపోవడానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. గతంలో 2000 సంవత్సరంలో ఇదే టిడిపి ప్రభుత్వం విజన్ 2024 పేరుతో బాక్సైట్ తీయాలని, ట్రైబుల్ అడ్వైజరీ కమిటీలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయడం జరిగిందని, ఆ తర్వాత ఉవ్వెత్తున ఉద్యమాలు చేయటం వలన వెనక్కి తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు ఆ చట్టంలో మార్పులు చేసి ఖనిజ సంపద దోచుకుపోయేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గేమ్మిలి కొండబాబు, కొర్ర అర్జున్, కొర్ర నారాయణ, గేమ్మిలి ప్రవీణ పాల్గొన్నారు.

అరకు చలి ఉత్సవాలపై వైసీపీ దుష్ప్రచారం తగదు

జనసేన నాయకులు గొర్లె వీరవెంకట్

విశాలాంధ్ర - జీకే వీధి: వైసీపీ పార్టీ మీద పూర్తి వ్యతిరేకతతో ప్రజలందరూ మూకుమ్మడిగా కూటమి ప్రభుత్వానికి భారీ విజయాన్నందించి మెజారిటీ స్థానాలు ఇచ్చారన్న బాధ ఇప్పటికీ వైసీపీ పార్టీ నాయకులకు వీడలేదని అరకు పార్లమెంట్ జనసేన ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీర వెంకట్ అన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాకుండా గిరిజన ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేని వైసిపి నాయకులు అరకు చలి ఉత్సవాలకు సంబంధించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ మూడు రోజులపాటు అరకు ఉత్సవాలు జరగటం వల్ల అనేక రాష్ట్రాల నుండి వివిధ దేశాల నుండి పర్యాటకులు రావటం వల్ల గిరిజన ప్రాంతాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్న కనీస జ్ఞానం లేని వైసిపి నాయకులు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవగాహన లేని నాయకులు రాజకీయాలలో ఉంటే గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందడం కష్టమన్నారు. వైసిపి ప్రభుత్వంలో అనేక స్టిక్కర్ల పేర్లతో సిద్ధమని ఫ్లెక్సీల రూపంలో ప్రజాధనం వందల కోట్లు దుర్వినియోగమైనప్పుడు వైసిపి నాయకులకు తెలియదా అన్నారు.

ఇప్పుడు గిరిజన ప్రాంతం పర్యాటకంగా ఈ కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయటాన్ని చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. అరకు లాంటి ప్రాంతం పర్యాటకంగా బాగా అభివృద్ధి చెందితే అక్కడ ప్రజలకు సంపద సృష్టించుకునే అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. వైసీపీ పార్టీ నాయకులు ఎన్ని పన్నాగాలు పన్నినా నమ్మే పరిస్థితిలో గిరిజన ప్రాంత ప్రజలు లేరని గిరిజన ప్రాంత ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని యువతకి ఉద్యోగ అవకాశాలు రావాలని ఆశిస్తున్నామని అన్నారు.

1/70పై ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజన ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, రద్దుకు ఎటువంటి ప్రయత్నాలు చేపట్టినా సహించబోమని సీపీఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు హెచ్చరించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన కోరారు. స్పీకర్ చేసిన వ్యాఖ్యలు ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని ఆయన కోరారు. బినామీల పేరుతో గిరిజన భూముల్లో లాడ్జీలు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. 2006-07లో కేంద్రంలో ఉన్న యుపిఏ ప్రభుత్వంపై వామపక్ష పార్టీలు ఒత్తిడి తెచ్చి అటవీ సంరక్షణ చట్టాన్ని తీసుకు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. 1/70ని సవరిస్తే మరింత వెనుకబడి పోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించు కోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో సీపీఎం మండల నాయకులు కూడేలి రమణమూర్తి, కే అప్పారావు, దూరు. కృష్ణమూర్తి, కిల్లో రామారా వు, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై సీపీఐ ఫైర్

విశాలాంధ్ర - కొయ్యూరు: గిరిజనులకు జీవనాధారమైన 1/70 చట్టంపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని సీపీఐ మండల కార్యదర్శి ఇరవాడ దేముడు ఆగ్రహం

వ్యక్తం చేశారు. 1/70 చట్టాన్ని టూరిజం పేరుతో సవరించాలని బాధ్యతా యుతంగా ఉన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. ప్రతి మనిషికి గుండె ఎంత ముఖ్యమో గిరిజనులకు 1/70 చట్టం అంతే ముఖ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సమైక్య అధ్యక్షుడు దర్సి సతీష్, మండల గిరిజన సమైక్య కార్యదర్శి పోట్టుకూరి దార మల్లేష్, మాజీ సర్పంచ్ గుమ్మ రాంబాబు, మాజీ వైస్ సర్పంచ్ ఎర్రవాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

అరకు చలి ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా స్టాల్స్

విశాలాంధ్ర - అరకులోయ: అరకులోయలో చలి ఉత్సవాలలో ప్రధాన వేదిక డిగ్రీ కళాశాల మైదానంలో స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఈ స్టాల్స్‌ను ప్రత్యేకంగా ప్రారంభించి అందరిని ఆకట్టుకున్నారు. సాధారణంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడానికి బదులుగా తుడుము వాయించి, ఉట్టిలో ధాన్యం, నీరు పోసి వడ్లు దంచి స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంప్రదాయ పద్ధతిలో స్టాల్ ప్రారంభించినట్లు చెప్పారు. గిరిజనులు నాచురల్ పెయింట్స్, బీడ్ వర్క్స్ స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఊటీ గిరిజనులు ఎంబ్రాయిడరీ స్టాల్‌ను, నాగాలాండ్ గిరిజనులు స్వెటర్ స్టాల్‌ను, మణిపూర్ గిరిజనులు పూసల దండల స్టాల్‌ను, రాజస్థాన్ గిరిజనులు గాజుల స్టాల్, చతీష్ గడ్ రాష్ట్ర గిరిజనులు మల్టీ మెటల్ స్టాల్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా సీతంపేట, రంపచోడవరం, పాడేరు ఐటీడీఏలు ఏర్పాటు చేసిన వన్ దన్ కేంద్రాలు, హుకుంపేట, అరకు, మండలాల గిరిజనులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. చొంపి గిరిజనులు ఏర్పాటు చేసిన లక్క బొమ్మలు, మాడగడ గిరిజనులు ఏర్పాటు చేసిన మట్టి బొమ్మలు స్టాళ్లతో పాటు కుండలు తయారుచేసే లైవ్ స్టాల్ మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కాఫీ టెక్నో సర్వ్ స్టాల్ ఏర్పాటు చేశారు. వంజంగి గిరిజనులు ఆదివాసి సంస్కృతిపై స్టాల్‌ని, నెల్లూరు గిరిజనులు చీరలు హెయిర్ బ్యాండ్స్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

ఏపీ టీడీసీ, జిసిసి, అటవీ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, తదితర శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేశారు.

మోకాళ్లతో భూ బాధితులు నిరసన

విశాలాంధ్ర - డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణానికి భూములు ఇచ్చిన భూ బాధితులకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఆ పాఠశాల ఆవరణ ఎదుట చేపట్టిన ఆందోళన శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి చిన్నస్వామి మాట్లాడుతూ భూములు ఇచ్చిన దాతలకు ఉద్యోగాలు కల్పించకుండా వేరే వారిని ఆయా స్థానాల్లో నియమించడం సరి కాదన్నారు. తొమ్మిది రోజు నుంచి దీక్షలు చేపట్టి ఆందోళన చేస్తున్న అధికారులు న్యాయం చేయక పోవడం విచారకరమన్నారు. ఈ కార్య క్రమంలో ఆ పార్టీ నాయ కులు పరశురాం, జగన్నాథం, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

పత్రికా విలేఖర్లు కావలెను

విశాలాంధ్ర తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఈక్రింది మండలాలు మారేడుమిల్లి, రంపచోడవరం, ప్రాంతాలకు అనుభవం గల విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెం. 7989138129, 7386603589

ఆహార భద్రతకు ఆదాయమే కీలకం

అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు

విశాలాంధ్ర - పాలకొండ: 2050 నాటికి ప్రపంచం మొత్తానికి ఆహారాన్ని అందించడమనే అతి పెద్ద సమస్యను ఎదుర్కొవడం ఒక సవాల్ అని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆహార అవసరాలను తీర్చడానికి మనం సరైన మార్గంలో లేకపోగా కనీసం దానికి సమీపంలో కూడా లేమని వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధకులు తెలిపారన్నారు. 2050 నాటికి ప్రపంచం 980 కోట్ల మంది ప్రజల అవసరాలను తీర్చడానికి తగినంత ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి పూనుకుంటున్న వేళ దాదాపు 80 కోట్ల మందిని ఆకలితో అలమటింపచేస్తున్న ఆహార కొరత అనేది ఏర్పడుతుందని తగినంత ఉత్పత్తి పడిపోవడం వల్లనే ఏర్పడలేదు సరి కదా, ఆహార కొరతను కేవలం తప్పుడు విధానాలు ఫలితమేనని దీనిని అందరూ గ్రహించాలి అన్నారు. దీనికి తోడు నేలకోత, భూమి క్షీణత, జీవ వైవిధ్య నష్టం, నీటి కొరత, సంఘర్షణలు వంటి అదనపు అంశాలు ఆహార ఉత్పాదకతను తగ్గిస్తాయన్నారు. ఇది ఖచ్చితంగా ఆందోళన కలిగించే విషయమే రష్య ఉక్రయిన్ యుద్ధం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన ఆహార సరఫరాలు దెబ్బతిన్నప్పుడు ఇదంతా జరిగిందన్నారు. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లో జీవ ఇంధన ఉత్పత్తిలో కేవలం 50 శాతం తగ్గించినట్లయితే అలా ఆదా చేసిన ధాన్యం యుద్ధం వల్ల ఏర్పడిన మొత్తం ఆహార కొరతను తీర్చగలద న్నారు. గోధుమ వరి వంటి పంటల్లో కిరణజన్య సంయోగక్రియను పెంపొందించడం ప్రధాన తృణధాన్యాల్లో జీవసంబంధమైన నత్రజనిని స్థిరీకరించడం వార్షిక పంటలను శాశ్వత పంటలుగా మార్చడం పంటల వ్యవస్థను వైవిధ్యకరించడం, సూక్ష్మజీవులు శిలీంద్రాల నుంచి పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను సృష్టించడం వంటి అవసమైన పరివర్తనా ప్రయత్నాలను చేపట్టాలని అన్నారు. బిలియన్ల కొద్దీ ప్రజలకు ఆరోగ్యకరమైన ఉత్పాదక, సురక్షితమైన జీవితాలను కల్పించడం వల్ల కలిగే ప్రయోజనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతటా విస్తృతంగా రాబడిని ప్రవహింపచేస్తుందని అంగీకరించాలని అన్నారు. వ్యవసాయ పరిశోధనలో పెట్టే పెట్టుబడి, బహుళ రాబడిని కలిగిస్తుందని చూపడానికి తగినన్ని ఆధారాలు ఉన్నప్పటికి భవిష్యత్‌లో విజయవంతమైన ఆహార వ్యవస్థను నడిపించే ఆవిష్కరణకు పునాదిగా ఉంటుందని సమాజం స్పాన్సర్ చేసిన పరిశోధన ఉండాలని కూడా నివేదిక పిలుపునిచ్చిందన్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన తక్కువ ఖర్చుతో కూడుకున్న స్థిరమైన ఆహారాన్ని అందించడంలో బహుళ మార్కెట్ వైఫల్యాల గురించి చెబుతుంది. అతి పెద్ద ఉపద్రవం ఏమిటంటే ప్రపంచంలోని ప్రతి చోటా వ్యవసాయ ఆదాయాలను పెంచడంలో మార్కెట్లు వైఫల్యం చెందిందన్నారు. 2024 సెప్టెంబర్‌లో ముగిసిన చివర 5 సంవత్సరాలకు సంబంధించిన బడ్జెట్ కోసం అమెరికా వ్యవసాయ బిల్లు రైతులకు వ్యవసాయానికి 1.8 ట్రిలియన్ డాలర్లను కేటాయించిందని, అయినప్పటికీ ఈ సంవత్సరం 5గురు రైతుల్లో ఒకరు వ్యవసాయం మానేస్తారని అమెరికా అంచన వేస్తుం దన్నారు. సరుకుల ధరలు తక్కువగా ఉండటం అధిక ఉత్పత్తి వ్యయం కారణంగా రైతులు ఎదుర్కొన్న నష్టాన్ని పూడ్చడానికి 10 బిలియన్ డాలర్ల తక్షణ సాయం వాగ్దానం చేసిందన్నారు. భారత్ పంజాబ్, హరియానా సరిహద్దుల్లో 11 నెలలకు పైగా జరుగుతున్న రైతుల నిరసన నేపథ్యంలో గమనించి 14 ఖరీఫ్ వంటల్లో మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే 12 నుంచి 26 శాతం తక్కువగా ఉన్నాయని, సంవత్సరాలుగా వ్యవసాయ ఆదాయాలు స్తబ్దుగా ఉంటున్నాయని,. లేదా కిందకు పడిపోతున్నాయన్నారు. 2050లో 150 కోట్ల మంది అదనపు ప్రజలకు ఆహారమివ్వటం ఖచ్చితంగా సాధ్యమేనని, కానీ వ్యవసాయాన్ని ఆచరణ మాయమైనదిగా, లాభదాకమైందిగా మార్చే కార్యాచరణ విధానం కీలకం అప్పుడే అది సాధ్యం అన్నారు.

ఇది చలి ఉత్సవాలు కాదు... వ్యాపార ఉత్సవాలు మాత్రమే

ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: ఐటిడిఏ నిధులతో ప్రభుత్వం నిర్వహిస్తున్న అరకు చలి ఉత్సవాలు కేవలం వ్యాపార ఉత్సవాలు అని నిజమైన గిరిజన సంప్రదాయ ఉత్సవాలు కాదని అరకు, పాడేరు ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు అన్నారు. ఉత్సవాలను రద్దుచేసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ అరకులోయ మ్యూజియం గేటులో వైకాపా తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా పాడేరు నుంచి అరకులోయకు బయలు దేరిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును జైపూర్ జంక్షన్ జాతీయ రహదారిలో శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జంక్షన్లోనే నిరసనకు దిగారు. అక్కడికి చేరుకున్న అరకు ఎమ్మెల్యే ఆ పార్టీ శ్రేణులతో బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. అరకు చలి ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగ చేయడమే తప్పా! ఆదివాసీలకు జరిగిందేమి లేదని అన్నారు. గిరిజన ప్రాంతాలలో కనీస మౌలిక సౌకర్యాలు లేని గ్రామాలు ఉన్నాయని, గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సదుపాయలు కల్పించండని వారు ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజేన్సీలో పెట్టుబడులు వస్తాయని రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ వ్యాఖ్యాలు చేయడం చూస్తుంటే గిరిజనులపై కూటమి ప్రభుత్వ వేఖరి స్పష్టంగా కనబడుతుందని అన్నారు. ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేసి, విద్య, వైద్యం, యువతకు ఉపాధిని కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని వారు హితవు పలికారు. ఆ పార్టీ నాయకులు చిన్నారావు, అప్పాలు, మల్లేశ్వరరావు, హరి, ఆనంద్, సురేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న విద్యార్థికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - దేవీపట్నం: మండలంలోని కొత్తవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పరదా వెంకటేష్ కొంతకాలంగా సికిల్ సెల్ ఎనిమీతో బాధపడుతూ బాగా నీరసించిపోయాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులంతా స్పందించి 2000 రూపాయలు విద్యార్థి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం వారి తల్లిదండ్రులకు అందజేశారు.

మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర - సీతానగరం: మండల స్థాయి అధికారులతో అభివృద్ధిపనులపైన, పలు అంశాలపై ఎమ్మెల్యే విజయ్ చంద్ర శుక్రవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త పథకాలకు సంబంధించి వారికి తెలియజేశారు. ఈసమీక్ష సమావేశంలో తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపీడీఓ పాండ్రంకి త్రివిక్రమరావు, పరిపాలన అధికారి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఉమా మహేశ్వరరావు, వెలుగు ఏపీఎం శ్రీరాములు నాయుడు, ఉపాధి హామీ పథకం సహాయ ప్రోగ్రాం అధికారి భాను, ఆర్ఐ శ్రీనివాస్, వెలుగు సీసీలు, నాయకులు వేణు, అరవింద్, తాతబాబు, భాస్కరరావులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో ఆత్మార్పణ దినోత్సవం

విశాలాంధ్ర - సీతానగరం: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రతిఒక్కరూ మానసిక ప్రశాంతతను సొంతం చేసుకోవచ్చని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేసినప్పుడు అందరికీ మంచి జరుగుతుందని ఆర్యవైశ్య సంఘ మహిళలు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఆత్మార్పణ దినోత్సవంను శు క్రవారం రాష్ట్రస్థాయిలో అన్నిచోట్ల ఆర్యవైశ్యులు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. జై వాసవి జై జై వాసవి మాతంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘానికి చెందిన మహిళలంతా పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సేవలు అమోఘం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా సేవలందించిన కాకురు వరలక్ష్మి శు క్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి పాఠశాల సిబ్బంది, గతంలో ఉద్యోగం చేసిన పలు పాఠశాలల ఉద్యోగులు, విద్యకమిటీ సభ్యులు, కుటుంబీకులు, సహచరులు ఆమెకు పలురకాల బహుమతులు అందజేసి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆమె 1999లో ఈ ఉద్యోగంలో చేరి కాట్రావులపల్లి, రంప చోడవరం, వై.రామవరం, ఎల్లవరం, గంగవరం, రాజవొమ్మంగి పాఠశాలల్లో పని చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాత్రికేయుల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల అల్లూరి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షులు టి.వీర్రాజు, పెదిరెడ్ల వెంకటేశ్వరరావు సమక్షంలో అధ్యక్షులుగా అరిపాక సూరిబాబు, ఉపాధ్యక్షులు ఊటాల ఉదయభాను, సెక్రటరీగా పుట్టా రామరాజు, జాయింట్ సెక్రటరీగా ఈకా శ్రీనుబాబు, ట్రెజరర్‌గా పోలిన సత్తిబాబు, కన్వీనర్‌గా బోదారపు శ్రీని వాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు తుపాటి వీర్రాజు మాట్లాడుతూ పాత్రికేయులు స్వచ్ఛంద సేవల్లో భాగస్వాములు కావాలని తెలిపారు. అయితే ఇప్పటికే రాజవొమ్మంగి బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు పడుతున్న అవస్థను గమనించిన పాత్రికేయులు మరుగుదొడ్లను నిర్మించేందుకు ముప్పై వేల రూపాయల నగదును మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో 24 మంది పాత్రికేయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కృష్ణ పడాల్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - జీకే వీధి: గూడెం కొత్తవీధి మండలం పరిధి గూడెం కొత్తూరు గ్రామం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఎల్ఎఫ్ హెచ్‌ఎం కంకిపాటి కృష్ణపడాల్ ఉద్యోగ పదవీ విరమణ శుక్రవారం చేశారు. ఆయనకు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ వీరోజి త్రిమూర్తులు దుశ్శాలువాతో సన్మానించడం జరిగింది. పలువురు ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విధి నిర్వహణలో 39 సంవత్సరాలు అంకిత భావంతో పనిచేసి ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేశారన్నారు. కర్తవ్యం సాధనకు ఎన్నలేని కృషి చేశారనీ అటు వృత్తిని దైవంగా భావించి ఉన్నత ఉద్యోగల నుండి ఎన్నో మన్ననలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బాధిత కుటుంబాలకు జమాల్ ఖాన్ వితరణ

విశాలాంధ్ర - చింతూరు: మండలంలోని సర్వేల గ్రామానికి చెందిన ముర్ర రాజయ్య, ముర్రం బుచ్చయ్య, మడకం భద్రయ్య, మడకం సుబ్బయ్య కుటుంబాలకు చెందిన నలుగురు గిరిజనులు మృతి చెందడంతో కుటుంబ పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్‌కు విషయాన్ని తెలిపారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కుటుంబ యజమానులు మృతి చెందటం పట్ల ఆయన సానుభూతిని వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు చొప్పున 12 వేల రూపాయలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ కుటుంబ యజమాని మృతి ఎంతో బాధా కరమైందని చిన్న వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న గిరిజనుల్లో ఇటువంటి అకాల మరణాలు ఎంతో బాధాకరమన్నారు. బయట కుటుంబాలకు ధైర్యంగా ఉండాలని చెబుతూ వారి పిల్లలకు విద్యాపరంగా ఎటువంటి అవసరం ఉన్న తాను ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందజేస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముత్యాల శ్రీరామ్, పి.సాల్మన్ రాజు, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె రియాజ్, నటరాజ్, జాన్ ప్రకాష్, జాన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపురెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా బిజెపి అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ద్వారపురెడ్డి శ్రీనివాసరావును ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో దుశ్శాలువా కప్పి, స్వీట్లు తినిపించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరావు అంచెలంచెలుగా రాష్ట్ర స్థాయిలో పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. దీంతోపాటు బీజేపీలో పలు పదవులు చేపట్టిన వారిని కూడా ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా దావోస్ పర్యటనలో పాల్గొని విజయ వంతంగా పర్యటన పూర్తి చేసుకున్న ఎమ్మెల్యే విజయ్ చంద్రను కూడా జిల్లా బిజెపి అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా బిజెపి కన్వీనర్ సొండి సంజీవ నాయుడు తదితరులు కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ సంజీవినాయుడు, పార్వతీపురం టౌన్ ప్రెసిడెంట్ వలిరెడ్డి పార్వతి, రూరల్ ప్రెసిడెంట్ బేతనాగభూషణరావు, సుందర ఆనంద్, పి.కనకరాజు, శంకరరావు, ఎం.శం కర్రావు, చంద్ర, ఈశ్వరరావు, జనార్ధన, చక్రధర్, పేర రాజు, టిడిపి నాయకులు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశం ఇవ్వండి:
నియోజకవర్గంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టులు తమకు అవకాశం కల్పించాలని బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేతో సమావేశమై దీనికి సంబంధించి అర్హులైన వారి జాబితాను కూడా అందించినట్లు తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్ బాధితుడికి జనసేన ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కొయ్యూరు: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన గోకిరి శ్యాం ప్రకాష్‌కు విరివిగా విరాళాలు అందించి అందుకునే విధంగా పాడేరు జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య దృష్టికి తీసుకు వెళ్తామని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, బూత్ కమిటీ కన్వీనర్ సాగిన బుజ్జిబాబు తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న గోకిరి శ్యాం ప్రసాద్ కు మండల జనసేన పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందించామన్నారు. అలాగే గత మూడేళ్ల క్రితం గోకిరి శ్యాంప్రకాశ్‌ను జనసేన పార్టీ, టిడిపికి చెందిన యువనేత హాస్పటల్‌లో చూపించడం, కిమో తెరిపియా కూడా చేయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు గోకిరి శ్యాం ప్రకాష్‌ను అన్ని విధాల వాళ్ళ చిన్నాన్న చూసుకుం టున్నారని, అదే తరుణంలో నాన్నమ్మ కూడా క్యాన్సర్‌తో బాధపడుతూ అనారోగ్యానికి గురి కావడంతో ఇద్దరు బాధ్యతలు చూసుకోలేని చిన్నాన్న ఎంతో నరకయాతన అనుభవించాడని తెలిపారు. మనసున్న దాతలు ఎవరైనా విరివిగా విరాళాలు అందించి ఆ శ్యాంప్రకాశ్‌ను కాపాడా ల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పీటా సుదీర్ బాబు, జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాఘవ రాజు, బంగారు బాబు, గూడేపు శేషు బాబు, నాగేంద్రబాబు, రాజేంద్రపాలెం యూత్ సాయిబాబు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకొని పెండింగ్ జీతాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం చిన్నగోర కాలనీ పంచాయతీ కార్యదర్శి గిరిజన యువతి మండంగి బాల కుమారిని తక్షణమే విధుల్లోకి తీసుకోని పెండింగ్ జీతాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ మేరకు శు క్రవారం పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత పంచాయతీ కార్యదర్శి, భర్త, కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్య దర్శులకు జరిగిన సాధారణ బదిలీల్లో బాలకుమారికి మొదట బామిని మండలం, కొరమ గ్రామ పంచాయతీకి బదిలీ చేసారని కానీ రిలీవ్ చేయలేదని, తరువాత జరిగిన బదిలీల మార్పుల్లో చిన గోర కోలని పంచాయతీకి తిరిగి బదిలీ చేసారని కానీ వీరఘట్టం ఎంపిడిఓ బాలకుమారిని విధుల్లోకి తీసుకోలేదని, జిల్లా అధికారులు నాలుగు నెలలైన ఇంకో చోట విధుల్లోకి తీసుకోకుండా, జీతాలు లేకుండా చేస్తూ నిర్లక్ష్యంగా ఉన్నారని రంజిత్ కుమార్ వివరించారు. తక్షణమే బాలకుమారిని విధుల్లోకి తీసుకొని, పెండింగ్ జీతాలు ఇవ్వాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా బాలకుమారి మాట్లాడుతూ సమస్యను శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లకు, రెండు జిల్లాల పంచాయతీ అధికారులకు, తెలిపిన పరిస్కారం కాలే దని ఆవేదన వ్యక్తం చేసారు. తనకు విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. నాలుగు నెలలుగా జీతాలు లేక, విధులు లేక నానా అవస్థలు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేసారు.

సిఆర్పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీసింగ్

విశాలాంధ్ర - చింతూరు: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జి /228 228 బియన్ ఆధ్వర్యంలో సుక్మా జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత గ్రామ పంచాయతీ బండాకు చెందిన ముర్లిగూడ గ్రామంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. మావోయిస్టుల నిర్మూలన కర్తవ్యంతో పాటు, గ్రామస్తుల జీవన ప్రమాణాలను మెరుగుపరచ డానికి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. 228 సిఆర్పిఎఫ్ కమాండెంట్ లతీఫ్ కుమార్ సాహు ఆధ్వర్యంలో మురళీగూడ క్యాంపులో 2025 సంవత్సరపు మొదటి సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ నిర్వ హించారు. ఇందులో భాగంగా మురళీగూడ, మంగళగూడ, బండ, ఇట్కల్ ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. బండ పంచాయతీలో ఈ సందర్భంగా గ్రామీణ మహిళలకు చీర, కుండ, హండీ, సోలార్ లాంతరు, పురుషులకు లుంగీ, టవల్‌తో పాటు గడ్డపార, గైటీ, వాటర్ డ్రమ్ములను రైతులకు, పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్, ప్లేట్, గాజులు పంపిణీ చేశారు. మురళీగూడ, మంగల్‌గూడ, బండ, ఇట్కల్ సమీప గ్రామాలకు చెందిన సుమారు 250 మంది గ్రామస్తులకు వాలీబాల్, క్రికెట్ బ్యాట్‌లు, టెలి విజన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 228వ కార్ప్స్ కమాండెంట్, సెకండ్ కమాండింగ్ ఆఫీసర్ లతీఫ్ కుమార్ సాహు, డిప్యూటీ కమాండెంట్ అమిత్ అతుత్, అజిత్ కుమార్ సింగ్, జి/228 గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కె.సహాయ కమీషనర్ పాపారావు, బండ పంచాయతీ సర్ప ంచ్, కార్యదర్శి పాఠశాల యక్ష, ప్రముఖులు పాల్గొన్నారు.

గెడ్డలుప్పిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - సీతానగరం: గెడ్డలుప్పి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు శుక్రవారం స్వామి వారి ఉత్సవ విగ్రహమూర్తులు, పూర్ణ కుంభం, కలసలముల తిరువీధుల ఊరేగింపు కార్యక్రమంను ఎంతో దేదీప్యంగా నిర్వహించారు. మూడురోజుల పాటు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీర్తినిస్తుంది: ఐటీడీఏ పీఓ

విశాలాంధ్ర - సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గల పొల్ల బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీనక భాస్కరరావు పదవి విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. మీనక భాస్కరరావు దంపతులను పూలమాలలతో సత్కరించి మాట్లాడారు. అన్ని సేవల్లో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీర్తి ప్రతిష్టలను పెంచుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు ఎంతోమంది విద్యార్థులను వారి బోధన ద్వారా ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదిగే విధంగా ప్రోత్సహిస్తారని గురుభక్తి ఎంతో విశిష్టమైనది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్న బాబు, డిడి అన్నదొర, కే.సుబ్బారావు, పి.నారాయుడు, ఆరిక భాస్కరరావు, యుగంధర్, మూటక రవికుమార్, కుటుంబ సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుపాం గ్రామ దేవత ఆలయ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం గ్రామ దేవత శ్రీ పైడిమారమ్మ అమ్మ వారి ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు నలబై లక్షల రూపాయల ప్రతిపాదనలతో నిర్మాణం చేపడుతున్న ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఉదయం పదిగంటలకు వేదపండితులు, మంగళ వాయిద్యాలు నడుమ కురుపాం గ్రామ పెద్దలు, ప్రజలు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయడం జరిగిందని కురుపాంకి చెందిన ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సకాలంలో అవకాశం ఉన్నంతలో మెండుగా విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు. అనువంశిక ధర్మకర్త బూరుబు నారాయణరావు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్ కుమార్, రామకృష్ణ, పోలినాయుడు, బుజ్జి, కార్తీక్, అప్పన్న, త్రిపుర నాథ్, నాగరాజు, సోమనాథ్, పెద్దలు మాజీ జడ్పీటీసీ కెవి కొండయ్య, కర్రి శ్రీనివాస్, బరాటం గుంపసోమేశ్వరరావు, కెవి సురేష్, కె.మల్లికార్జునరావు, రమణ కుమార్, రమణమూర్తి, చంద్ర శేఖర్, నాగేశ్వరరావు, వెంకటరావు, మాజీ సర్పంచ్ గొటారి రాజు, మాజీ ఉపసర్పంచ్ గౌరీ శంకర్, సర్పంచ్ సుజాత, ఎంపీపీ పద్మావతి, జడ్పీటీసీ సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, ఎంపీటీసీలు స్వామి, బంగారు నాయుడు, సంతోషి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజయ గౌరీ గెలుపు కోసం విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - బలిజిపేట: యుటిఎఫ్ వచ్చేనెల ఫిబ్రవరి 27న జరగబోయే ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరీ గెలుపు కోసం బలిజిపేట మండలంలో యుటిఎఫ్ విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని రక్షించుటకు ఉపాధ్యాయ అధ్యాపకులు సమస్యలు పరిష్కారం కొరకు నిరంతరం పోరాటం చేస్తున్న యుటిఎఫ్ సంఘంలో రాష్ట్రస్థాయి పదవిని నిర్వహించిన కోరెడ్ల విజయ గౌరీని గెలిపించాలని కోరారు. ప్రశ్నించే తత్వం, పోరాడే తత్వము అలవర్చుకున్న మహిళ అభ్యర్థి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈమెను గెలిపించి శాసన మండలికి పంపించాలని బలిజిపేట మండలంలో శుక్రవారం హైస్కూల్ కళాశాలలో కేజీబీవీ పాఠశాలలో విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణ, శ్రీనివాసరావు, కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి: అడ్డతీగల సీఐ

విశాలాంధ్ర - గంగవరం: వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని అడ్డతీగల పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహమూర్తి సూచించారు. శుక్రవారం రాత్రి స్థానిక వై జంక్షన్‌లో వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహందారులతో మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు సక్రమంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఆయన వెంట గంగవరం పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు పౌర హక్కులపై అవగాహన

విశాలాంధ్ర - కురుపాం: జాతీయ పౌర హక్కులు దినోత్సవం పురస్కరించుకుని ఎస్ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం ప్రకారం పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ హక్కులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే పోలీసు శాఖను ఆశ్రయించాలని కోరారు.

విశాలాంధ్ర
పేజీ : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
శనివారం 1, ఫిబ్రవరి 2025

ఫిబ్రవరి 5న ఫీజు పోరు విజయవంతం చేయాలి

పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

విశాలాంధ్ర - పాడేరు: వైసీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న పాడేరులో జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఫీజు పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయంలో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ద్వారా ఉచిత విద్య అందేదన్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా ఫీజు రీయింబర్స్మెంట్ పథకాల ద్వారా నగదు జమ అయ్యేదన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి కూడా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ అందలేదన్నారు. ఇందుకు నిరసనగా ఫిబ్రవరి 5న వైయస్సార్సీపి అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు ఫీజు పోరు పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్ఆర్సిపి శ్రేణులు విద్యార్థులు తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సరభ సూర్యనారాయణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగళన్న దొర, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్న దొర, సర్పంచులు గొల్లోరి నీలకంతం, కుర్రబోయిన సన్నీబాబు, వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు, కె. బొంజుబాబు, పీఏసిఎస్ మాజీ చైర్మన్ టి. వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు పలసీ రామారావు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు

విశాలాంధ్ర - బెలగాం: వసతి గృహ విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. 16వ వార్డులో గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. సిక్ రూం తనిఖీ చేసి అక్కడ అనారోగ్య సమస్యతో ఉన్న విద్యార్థుల ఆరోగ్య స్థితి పరిశీలించారు. వారికి అందజేసిన చికిత్స, వైద్య పరీక్షల వివరాలపై వసతి గృహ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిక్ రూంలో మందులు తనిఖీ చేసారు. సిక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని వసతి గృహ హెల్త్ స్టాఫ్ను ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్లో ఏవిధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారు. సంబంధిత వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీసి స్క్రీనింగ్ వివరాలు రికార్డులో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఎవరికైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని అడిగారు. చర్మ సంబంధిత సమస్యలు తెలియజేయగా వారిని పరిశీలించి ఏ విధమైన చికిత్స అందిస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి విద్యార్థుల్లో గుర్తించిన ఆరోగ్య సమస్యలు నయమయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ చూపి పర్యవేక్షణ చేయాలన్నారు. ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు లభ్యత తెలుసుకొని విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా సమిష్టి కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి. చిన్నమోహన్ రాయుడు, ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, వైద్య సిబ్బంది నారాయణమ్మ, హాస్టల్ హెల్త్ స్టాఫ్ శ్రీరంజని, అనూష, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఉప విద్యా శాఖాధికారి

విశాలాంధ్ర - సీతంపేట: ఐటిడిఏ పరిధిలో గల నల్లరాయి గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఉప విద్యాశాఖ అధికారి కుమార్ శుక్రవారం సందర్శించారు. 148 ఎక్కువ స్ట్రెంగ్త్ వున్న స్కూల్ పాఠశాలకు సంబంధించి అవసరం అయిన సదుపాయాలు కల్పించటం కోసం సందర్శించిరనట్టు తెలిపారు. పాఠశాల నిర్వహణ సంతృప్తికరంగా ఉంది అన్నారు. ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 పంచాయతీల్లో ఉపాధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో 21 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పనులు శుక్రవారం నుండి ప్రారంభించారు. ఈరోజు మండలం మొత్తం నాకు హాజరైన వేతన దారులు 3254 మంది వేతనదారులు పనిచేయడం జరుగుతుంది. పనులు జరుగుతున్నవి భూ అభివృద్ధి పనులు ఫారం పాంట్స్ ట్రెంచ్ వర్కులు కాలువలు ట్యాంక్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో డిడి స్వరూప రాణి కవిరిపల్లి గ్రామపంచాయతీలో తుమ్మెకుల బందలో నీ మాస్టర్ తనిఖీ నిర్వహించారు. వేతన దారులు 60 మంది హాజరయ్యారు అని ఏపీవో. శంబంగి ఈశ్వరమ్మ తెలిపారు.

పులి దుంపలు తిని ఉపాధి కూలీలకు అస్వస్థత

విశాలాంధ్ర - కురుపాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లిన కూలీలకు దొరికిన పులిదుంపలు తిని ముగ్గురు ఉపాధి కూలీలు అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని రస్తా కుంటుబాయిలో చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం పనులకు వెళ్లిన రస్తా కుంటుబాయి ఉపాధి కూలీలు ఆరిక చరణ్, ఆరిక మాధవరావు (ఫీల్డ్ అసిస్టెంట్) ఆరిక ప్రవీణ్లు అందరితో కలిసి పనులకు వెళ్ళారు. పని ప్రదేశంలో దొరికిన పులిదుంపలు కాల్చుకుని తిన్నారు. కొద్ది సేపటికి ఒంట్లో వికారం, కళ్ళు తిరిగి, వాంతులు కావడంతో తోటి కూలీలు కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్య సేవలు అనంతరం వారంతా క్షేమంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేదని ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర - కురుపాం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో తహశీల్దార్ ఎం.రవణమ్మ శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్ కేంద్రంలో విద్యుత్, త్రాగు నీరు, రక్షణ వసతులు తనిఖీ చేశారు.

న్యూట్రిషన్ కిట్స్ అందజేత

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగంపేట చిన్నారాయుడిపేట తాండ సీతారాంపురం గ్రామాలలో అంగన్వాడి సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణీలకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్స్ అందజేసినట్లు ఐసిడిఎస్ పిఓ ఎస్.సులేఖ, సూపర్వైజర్ యు.పూర్ణిమలు తెలిపారు. పౌష్టికాహారాన్ని సకాలంలో గర్భిణీలు తీసుకుని ఆరోగ్యాన్ని పెంచుకో వడంతో పాటు రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులు, గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

కూటమి నేతలకు తలనొప్పిగా ఆర్వీనగర్ - పాలగెడ్డ రహదారి

విశాలాంధ్ర - సీలేరు: అంతరాష్ట్ర రహదారి అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం ఆర్వీనగర్ - పాలగెడ్డ వరకు అంతరాష్ట్ర రహదారికి అడుగడుగనా గోతులు ఏర్పడడంతో ఈ దారిన ప్రయాణించే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి పనులు పూర్తవుతాయని ఆశించినప్పటికీ ఏమాత్రం అప్పటి నాయకులు గానీ అధికారులు కానీ స్పందించలేదు. అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కొంత రహదారి నిర్మించినప్పటికీ గత సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీన కురిసిన భారీ వర్షాలకు రహదారి మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. ఒడిశా తెలంగాణ చత్తీష్ఘడ్ రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు ఇదే ప్రధాన రహదారి. ప్రస్తుతం ఈ రహదారులో ప్రయాణం చేయాలంటే నరకయాతన పడాల్సిందే. ఈసారి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్రాంతి పండుగ అనంతరం ఈ రహదారి పనులు చేపడతామని అధికారులు మరియు గిరిజన శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రాంతీయులకు హామీ ఇచ్చారు. జనవరి నెల ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు రహదారి పనులు ప్రారంభించలేదు. ఈ ప్రాంతంలో నివసిస్తున్నటువంటి కూటమి నాయకులు ఎక్కడికి వెళ్లినా ఈ రహదారికి విముక్తి లేదా రహదారిని ఎప్పుడు నిర్మిస్తారని అందరూ వీరిని ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి సమస్య కూటమి నాయకులకు పెద్ద తలనొప్పిగా తయారైంది. నాయకులు ద్వారా అధికారులతో మాట్లాడుతున్నామని వారు ప్రజలకు తెలియజేస్తున్నారు. శీతాకాలం ముగుస్తుందని రానున్న ఎండాకాలంలోపు ఈ రహదారిని నిర్మించకపోతే మరలా వర్షా కాలంలో రహదారి నిర్మాణం పనులకు ఆటంకం కలుగుతుందని వెంటనే రహదారి నిర్మాణం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోతురాజు, గోవిందరాజు, శోభ జగన్, బైశెట్టి సుందర్రావు, తగ్గి బంగారుదొర, మడిగుంట లక్ష్మీనారాయణ, భౌడు, సతీష్ దొర, గడుతూరి చిన్నారావు, శెట్టి రాంబాబు పోతురాజు, కృష్ణ, గొర్లె బర్సయ్య, పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రోజుకో మలుపు తిరుగుతున్న మహిళ భూ వివాదం

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రంలో గత 5రోజులుగా చంటి పిల్లతో భూమి నాది అని నాకు న్యాయం జరగాలని నిరసన తెలుపుతున్న మహిళ వివాదం రోజుకో మలుపు తిరుగుతుంది. వివరాలు పెదబయలు మండలం అరడ కోట గ్రామానికి చెందిన గంపరాయి దామోదరం కుమారుడు చంద్రమౌళి, కుమార్తె జి.బాలప్రభ ఇరువురు కలిసి 2019 హుకుంపేటలో తనకున్నటువంటి ఇల్లును అమ్మేశారు. అయితే ఆ భూమి పత్రాలపై కుమారుడు కుమార్తె కలిసి సంతకాలు చేసినప్పటికీ హఠాత్తుగా అమ్మిన అప్పటి భూమిలో తనకు అన్యాయం జరిగిందని తన సోదరులు మోసం చేశారని ఇప్పుడు నాకు భూమిపై సర్వహక్కులు ఉందని ఇంటిని ఖాళీ చేయాలని గేటు తలుపులకు తాళాలు వేసి నిరసన చేపడుతుంది. ఈ విషయంపై ఆమె సోదరుడు చంద్రమౌళి గురువారం రాత్రి మీడియా సమావేశంలో జరిగిన విషయాలు వెల్లడించారు. తన సోదరి పెళ్లి నిమిత్తం భూమి అమ్మిన సొమ్ముతో అనకాపల్లి వాస్తవ్యుడు ఇల్లీ ప్రకాష్ అనే గిరిజనేతరునితో ఘనంగా పెళ్లి చేశామని తెలిపారు. అందరము కలిసి పత్రాలపై సంతకం పెట్టామని ఒకవైపు చెప్తుండగా నేను ఖాళీ స్టాంప్ పేపర్ మీద సంతకం పెట్టాను తప్ప వేరే వాటి మీదపెట్టలేదని ఆమె ఆరోపిస్తుంది. రోజుకో మలుపు తిరుగుతున్న ఈ భూ వివాదంపై సంఘాల సైతం వీరికి మద్దతు పలకడానికి వెనుకంజ వేస్తున్నారు. గిరిజనుడ్ని పెళ్లి చేసుకుంటే తప్పక మద్దతు పలుకుతామని ఆమె గిరిజననేతరునికి పెళ్లి చేసుకోవడంతో ఆందోళన వల్ల వచ్చే ప్రయోజనం గిరిజనేతరులు పొందుతారని అందువలన వారు వెనుకంజ వేస్తున్నారని తెలుస్తుంది.

అరకు చలి ఉత్సవ్ దృశ్యమాలిక